నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 26 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM

ఊరూరా రంగులాట..

కొత్తగూడెం క్రైం : నృత్యం చేస్తున్న ఎస్పీ రోహిత్ రాజు, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్

భద్రాచలం : హోలీ వేడుకల్లో పాల్గొన్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

ఖమ్మం రూరల్ : ఎస్ఆర్ కాలనీవాసుల హోలీ సంబురాలు

అశ్వారావుపేట : హోలీ ఆడుతున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

ఖమ్మం కమాన్ బజార్ ఆంజనేయస్వామి గుడి వద్ద నృత్యం చేస్తున్న మహిళలు

లక్ష్మీదేవిపల్లి : హోలీ సంబురాల్లో యువకులు

ఖమ్మం గట్టయ్య సెంటర్‌లో కేరింతలు కొడుతున్న చిన్నారులు

ఖమ్మం : కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో హోలీ వేడుకల్లో కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్ దత్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హోలీ సంబురం
- వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్లు, సీపీ, ఎస్పీ, ప్రజాప్రతినిధులు
- కేరింతలు కొడుతూ రంగులు పులుముకున్న యువత
- వీధుల్లో సందడి చేసిన చిన్నారులు

ఖమ్మం బైపాస్ రోడ్‌లో యువతుల సెల్ఫీ

చర్లలో..

ఖమ్మం వీడీవోస్ కాలనీలో హోలీ సంబురాల్లో నృత్యం చేస్తున్న యువత

హోలీ వేడుకల్లో పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

ఊరూ.. వాడా రంగుల పండుగను అంబరాన్నంటేలా చేసుకున్నారు. వయసు తారతమ్యాన్ని మరిచి.. స్థాయిలను విస్మరించి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సప్తవర్ణ రంగులను చేతులకు పులుముకొని ఆనంద డోలికల్లో మునిగి తేలారు. కేరింతలు కొడుతూ.. ఈలలు వేస్తూ.. నీళ్లు చల్లుకుంటూ.. డీజే మోతల నడుమ నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి కామ దహనాన్ని నిర్వహించి.. సోమవారం తెల్లవారుజాము నుంచే చిన్నారులు, యువతీ యువకులు రంగులతో స్నేహితులు, బంధువుల ఇళ్లకు తిరుగుతూ.. రంగులు పూసుకుంటూ అవధులు లేని సంతోషంతో సంబురంగా వేడుకలు జరుపుకున్నారు. ఖమ్మం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒకరిపై ఒకరు సంబురంగా రంగులు చల్లుకున్నారు. హోలీ పండుగను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఖమ్మంలో మేయర్ పునుకొల్లు నీరజ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ దంపతులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హోలీ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఎస్పీ రోహిత్ రాజు హోలీ వేడుకల్లో పాల్గొని నృత్యం చేశారు. కలెక్టర్ పిల్లలు అంగన్‌వాడీ చిన్నారులతో కలిసి సరదాగా ఆడుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ హోలీ పండుగ సంబురాలు ప్రజలకు చాలా ఆనందాన్ని పంచుతాయన్నారు. డీసీహెచ్ఎస్ రవిబాబు దప్పు కొడుతూ సంబురాల్లో పాలుపంచుకున్నారు. *-నమస్తే నెట్‌వర్క్, మార్చి 25*

ఇల్లెందు : రంగులు పూసుకుంటున్న హమాలీలు

ఖమ్మం కమాన్ బజార్‌లో నృత్యం చేస్తున్న మహిళలు

కొత్తగూడెం సింగరేణి : హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

చండ్రుగొండలో హోలీ వేడుకల్లో యువకులు

ఖమ్మం కమాన్ బజార్ ఆంజనేయస్వామి గుడి వద్ద సంబురాలు

ఖమ్మం కమాన్ బజార్‌లో యువతుల సంబురాలు

వైభవోపేతంగా డోలోత్సవం, వసంతోత్సవం

- ఉత్సవమూర్తులకు పంచామృతాలతో ప్రత్యేక స్నపనం
- రామయ్య పెళ్లి తలంబ్రాల తయారీకి శ్రీకారం
- గోటి తలంబ్రాలతో భద్రాద్రికి తరలివచ్చిన భక్త బృందాలు
- నయనానందకరంగా పసుపు దంచే వేడుక

భద్రాచలం, మార్చి 25 : హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం డోలోత్సవం, వసంతోత్సవం కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పంచామృతాలతో ప్రత్యేక స్నపనం చేపట్టారు. ఏప్రిల్ 17న శ్రీరామ నవమిని పురస్కరించుకొని స్వామివారి కల్యాణంలో వినియోగించే తలంబ్రాల తయారీకి సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. తొలుత విశ్వక్సేన ఆరాధన, కర్మణః పుణ్యాహవాచన చేసి కలశావాహన నిర్వహించారు. అనంతరం పంచామృతాలు, 9 రకాల పళ్ల రసాలు, సాలగ్రామహారం, తులసీ మాలలు, హరిద్రాచూర్ణంతో స్వామివారికి అభిషేకం చేసి.. కుంభ, ధ్వజ, అష్ట, ద్వాదశ హారతులు, అర్ఘ్య, పాద్య ఆచమనం సమర్పించి ఫలాలను నివేదన చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అందంగా అలంకరించిన బంగరు ఊయలలో స్వామివారిని ఆశీనులను చేసి డోలోత్సవం జరిపారు. స్వామివారికి ప్రత్యేక హారతులు సమర్పించారు. దేవస్థానం ఆస్థాన హరిదాసులు భక్త రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలను ఆలపించారు.

రామయ్యకు వసంతోత్సవం

హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి వసంతోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత అంతరాలయంలోని మూలవరులకు, లక్ష్మీతాయారమ్మ వారికి, ఆంజనేయస్వామికి వసంతాన్ని చల్లి.. తర్వాత భక్తులపై చిలకరించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ జరిపారు.

కల్యాణ తలంబ్రాల తయారీకి శ్రీకారం

శ్రీరామ నవమి రోజు రామయ్య కల్యాణంలో వినియోగించే తలంబ్రాల తయారీకి సోమవారం సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. ఉత్సవమూర్తులను మిథిలా ప్రాంగణం ఎదురుగా ఉన్న ఉత్తర ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి రోలు, రోకళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మి, సరస్వతులను ఆవాహన చేసి రోళ్లు, రోకళ్లకు కంకణధారణ గావించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణంలో పాల్గొనే ఆచార్య, బ్రహ్మరుత్విక్కుల రోళ్లలో పసుపు కొమ్ములు వేసి దంచగా.. తర్వాత వారి భార్యలు రోళ్లలో పసుపు కొమ్ములు వేసి దంచారు. ఆ తర్వాత పసుపు, కుంకుమ, నెయ్యి, బుక్కా గులాల్, అత్తరు, పన్నీరు తదితర సుగంధ ద్రవ్యాలతో తలంబ్రాలను కలిపే వేడుకలను నయనానందకరంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి గోటి తలంబ్రాలను తీసుకొచ్చిన భక్త బృందాలు, భక్తులతో భద్రాద్రి పట్టణం భక్తజన సంద్రంగా మారింది. కాగా.. ఎంతో విశిష్టత ఉన్న భద్రాద్రి రామయ్య కల్యాణ తలంబ్రాలను భక్తులు తమ ఇళ్లలో జరిగే వివాహ తలంబ్రాలతో కలిపి వధూవరుల శిరస్సుపై పోయిస్తారు.

ఉత్సవమూర్తులపై వసంతం చల్లుతున్న అర్చకులు

తలంబ్రాలు కలుపుతున్న ముత్తైదువులు

పర్ణశాల రామాలయంలో డోలోత్సవం

పసుపు దంచుతున్న ముత్తైదువులు

పర్ణశాల, మార్చి 25 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల ఆలయంలో సోమవారం హోలీ పర్వదినం రోజు డోలోత్సవం కార్యక్రమాన్ని అర్చకులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి స్వామివారికి తిరువారాధన, తిరుకల్యాణ మహోత్సవంలో భాగంగా అంకురార్పణ కార్యక్రమం చేపట్టారు. తర్వాత నిత్య హోమం, స్వామివారికి విశేష ప్రసాద నివేదన కార్యక్రమాన్ని జరిపారు. సోమవారం ఉదయం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా డోలోత్సవం, వసంతోత్సవం కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీపూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. వచ్చే నెలలో జరిగే శ్రీరామ నవమిని పురస్కరించుకొని రామయ్యను పెళ్లి కొడుకు చేసే తంతులో భాగంగా ముత్తైదువుల చేతులతో పసుపు కొమ్ములు చూర్ణంగా చేసి మూలమూర్తులకు, ఉత్సవమూర్తులకు అర్చకులు సమర్పించారు. రంగుల ద్రవ్యాలతో వసంతం తయారు చేసి స్వామివారికి సంప్రోక్షణను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీరామచంద్ర స్వామివారు పెండ్లి కొడుకు రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 4 గంటలకు స్వామివారికి తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు. రాములోరి కల్యాణ తలంబ్రాలను ముత్తైదువులు పసుపు, కుంకుమలతో కలిపి సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు శేషన్ కిరణ్‌కుమారాచార్యులు, రామ భద్రాచార్యులు, అమరవాది వెంకటరామన్, నరసింహాచార్యులు, ఆలయ స్పెషల్ ఆఫీసర్ సీసీ అనిల్‌కుమార్, గుమస్తా ప్రసాద్, సిబ్బంది రాము, శివ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో శ్రీరామ నవమి టికెట్లు

భద్రాచలం, మార్చి 25 : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 17న జరుగనున్న శ్రీరామ నవమి(రామయ్య కల్యాణం), పట్టాభిషేకం సెక్టార్ టికెట్లను సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో భక్తుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచుతున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయదాతల కల్యాణోత్సవం టికెట్ రూ.7,500, రూ.2,500, రూ.2వేలు, రూ.వెయ్యి, రూ.300, రూ.150, పట్టాభిషేకానికి రూ.1,500, రూ.500, రూ.100 చొప్పున నిర్ణయించామని, వీటిని భక్తులు ఆన్‌లైన్ పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి భక్తులకు నేరుగా టికెట్లు విక్రయిస్తామని, ఇందుకోసం నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పరోక్ష సేవలకు అవకాశం..

స్వామివారి కల్యాణం తిలకించేందుకు రాలేని భక్తులు పరోక్షంగా తమ గోత్రనామాలతో కల్యాణం జరిపించుకోవచ్చని ఈవో తెలిపారు. ఇందుకు రూ.5 వేలు, రూ.1,116 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. సెక్టార్ టికెట్లు, పరోక్ష సేవల టికెట్ల కోసం https://bhadradritemple. telangana. gov.in ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు తమ ఒరిజినల్ టికెట్లను పొందడానికి ఏప్రిల్ ఒకటో తేదీ ఉదయం 11 నుంచి ఏప్రిల్ 17 ఉదయం 6 గంటల వరకు తానీషా కల్యాణ మండపంలో ఉన్న సీఆర్వో కార్యాలయంలో తమ ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించి పొందవచ్చని ఆమె పేర్కొన్నారు.